సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 17 । మే । 2024



ఎన్నాళ్లీ కూతవేటు?

కాకినాడ–కోటిపల్లి రైలుబస్సు సేవలు నిలిచిపోవడం, కోట్లాది రూపాయలతో పునరుద్ధరించిన రైల్వే లైన్ నిరుపయోగంగా మారడంపై ప్రయాణికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

8లో



రత్నగిరికి పెళ్లి కళ

ఈ నెల 18 నుంచి 24 వ తేదీ వరకూ సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఈఓ రామచంద్ర మోహన్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
36.0° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	36.0	26.0
కాకినాడ	32.3	26.7
అమలాపురం	34.0	27.0

వర్షాతిరేకాలు

- జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం
- ఉష్ణోగ్రతలు తగ్గి సేద తీరిన సామాన్య జనం
- ఉద్యాన పంటల రైతులకు ఊరట
- అన్నదాతలకు కొంత ఇబ్బంది
- పనల మీద 203 ఎకరాల వంట
- ధాన్యం రాశుల చుట్టూ చేరిన వాన నీరు
- సగటున 12.8 మిల్లీమీటర్ల వర్షం



ఉప్పలగుప్తం మండలంలో పనల మీద వరి చేలు

సాక్షి అమలాపురం: నైరుతి రుతుపవనాల రాక చురుగ్గా ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన సమయంలోనే జిల్లాలో గురువారం తెల్లవారు జాము నుంచి ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల సామాన్యులు ఊరట చెందారు. ఉద్యాన, వాణిజ్య పంట రైతులు హర్షం వ్యక్తం చేశారు. కానీ వరి రైతులకు మాత్రం అకాల వర్షం కొంత ఇబ్బందిగా మారింది. కోతలు దాదాపు పూర్తవుతున్నా.. కొంత పంట పనల మీద ఉండడం, వాన వల్ల ధాన్యం రాశుల చుట్టూ ముంపు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఏకధాటిగా పడింది. భారీ వర్షానికి పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. అమలాపురం పట్టణంతోపాటు పలు గ్రామాల్లో రోడ్లపై నీరు చేరింది. పది గంటల తరువాత తెరపి ఇవ్వడంతో ముంపునీరు వీడింది. జిల్లాలో బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు సగటున 12.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా ఉప్పలగుప్తం మండలంలో 45.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. అత్యల్పంగా రాయవరం మండలంలో 1.4 మి.మీటర్ల వర్షం కురిసింది. అల్లవరం 30.6, మామిడికుదురు 28.8, కాట్రేనికోన 24.2, అమలాపురం 22.8, అయినవిల్లి 20.6, మలికిపురం 14.2, కె.గంగవరం 13.2, అంబాజీపేట 12.8, ఐ.పోలవరం 12.6, ముమ్మిడివరం 10.4, రామచంద్రపురం 9, రాజోలు 7.4, పి.గన్నవరం 5.8, ఆత్రేయపురంలో 5.4, ఆలమూరు 4.2, కపిలేశ్వరపురం, సఖినేటిపల్లి, రావులపాలెం 3.2, కొత్తపేట 2, మండపేటలో 1.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.



అమలాపురం మండలం తాండవపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆర బెట్టుకుంటున్న రైతులు

ఎండల నుంచి ఉపశమనం

ఈ ఏడాది సాధారణ వర్షపాతంతోపాటు పలు జిల్లాలో అధికంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలిగిస్తూ జిల్లాలో తెల్లవారు జాము నుంచి ఉదయం పది గంటల వరకు ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 35 డిగ్రీల నుంచి 37 డిగ్రీల వరకు ఉంటుండగా, అది 31 డిగ్రీలకు తగ్గింది. కనిష్ట ఉష్ణోగ్రతలు 29 నుంచి 30 వరకు నమోదవుతుండగా అవి 26 డిగ్రీలకు తగ్గింది. వాతావరణం చల్లబడడంతో సామాన్యులు సేద తీరారు. మధ్యాహ్న సమయంలో రోడ్ల మీద జన సంచారం అధికంగా కనిపించింది. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ చెప్పడంతో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని జనం భావిస్తున్నారు.

ఉద్యాన పంటలకు మేలు

వర్షం ఉద్యాన పంటలకు, కూరగాయ పంటలకు మేలు చేసింది. కొబ్బరి, ఆయిల్‌పామ్, కోకో, పోక, అరటి, కంద, పసుపు వంటి పంటలతోపాటు గోదావరి లంకలు, మధ్యడెల్టాలో పలుచోట్ల కూరగాయ పంటలు పెద్ద ఎత్తున సాగు అవుతున్న విషయం తెలిసిందే. భారీ వర్షం కురిసిన ప్రాంతాల్లో దోమ, ఇతర రసం పీల్చే పురుగులు ఉధృతి తగ్గుతుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. పి.గన్నవరం, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, మామిడికుదురు మండలాల్లోని లంక గ్రామాల్లో కూరగాయ పంటలు పెద్ద ఎత్తున సాగవుతున్నాయి. ఈ పంటలకు సైతం వర్షం వల్ల మేలు జరుగుతుంది.

ధాన్యం రాశుల చుట్టూ చేరిన వర్షం నీరు



అమలాపురం మండలం చిందాడగరువు వద్ద ధాన్యం రాశుల చుట్టూ చేరిన వర్షంనీరు

ఈ అకాలవర్షం రబీ రైతులకు ఇబ్బందికరంగా మారింది. జిల్లాలో వరి కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. మొత్తం 1.69 లక్షల ఎకరాల్లో వరిసాగు జరగగా, ఇప్పటి వరకు 1.63 లక్షల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. 96 శాతం వరి కోతలు పూర్తి అయినందున భారీ వర్షం వల్ల రైతులకు పెద్దగా నష్టం లేదు. కానీ 230 ఎకరాల్లో వరి పనలు ఉండగా, ధాన్యం రాశులు చుట్టూ వర్షం నీరు చేరింది. నీరు తొలగించేందుకు రైతులు హైరానా పడ్డారు. తూర్పు డెల్టాలో ఆలమూరు, రామచంద్రపురం వ్యవసాయ సబ్ డివిజన్లలో దాదాపుగా వరి కోతలు పూర్తి కాగా, మధ్యడెల్టాలో కొత్తపేటలో సైతం కోతలు పూర్తయ్యాయి. పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్లలో కోతలు సాగుతున్నాయి. 80 శాతం మెషీన్ కోతలే కావడం విశేషం. ఈ ఏడాది మెషీన్ కోతల వల్ల అనుకున్న సమయం కన్నా ముందుగానే వరి కోతలు పూర్తయ్యాయి. దీనివల్ల పెద్దగా నష్టం లేదు. ఈ వర్షానికి నష్ట ప్రభావం పెద్దగా ఉండదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత



ఈవీఎం భద్రతపై ఎస్పీతో సమీక్షిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

అమలాపురం రూరల్: స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతతో పటిష్ట చర్యలు చేపట్టినట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ఎస్. శ్రీధర్‌తో ఈవీఎంల భద్రతపై సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు, రెండవ స్థాయిలో ఆర్మ్‌డ్ రిజర్వుడు బలగాలు, మూడవ స్థాయిలో సీ విజిల్ పోలీసు బలగాలను మోహరింపచేశామని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉందని చెప్పారు. ప్రతి స్ట్రాంగ్‌రూమ్, పరిసరాలలో సీసీ టీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్నత స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు వరకూ జరుగుతున్న శాంతి భద్రతల పర్యవేక్షణ స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా విధుల దిశానిర్దేశం చేశారు. అనంతరం చెయ్యేరులో శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలో ఉన్న స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను ఆయన పరిశీలించారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్లపై నిఘా కొనసాగుతుందని తెలిపారు. అపోహలు, తప్పుడు సమాచారాలు నమ్మి ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కాట్రేనికోన మండలంలో సమస్యాత్మక పల్లం గ్రామాన్ని సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితులు పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట డీఎస్పీ మహేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ విజయసారథి ఎస్పీ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్‌రావు, శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ముమ్మిడివరం, కాట్రేనికోన ఎస్సైలు ఉన్నారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్



పరీక్షా కేంద్రంలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న అధ్యాపకులు

అమలాపురం రూరల్: బీవీసీ భట్లపాలెం క్యాంపస్‌లో ఏపీ ఈఏపీ సెట్ 2024 గురువారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించిన ప్రవేశ పరీక్షలు రోజు రెండు పూటలా జరుగుతాయి. మొదటి రోజు ఉదయం 340 మందికి గాను 304 మంది హాజరు అయ్యారు. మధ్యాహ్నం 340 మందికి గాను 309 మంది హాజరు అయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకు ఈ పరీక్షలు ఉంటాయని, 3,000 మందికి బీవీసీ సెంటర్‌ల కేటాయించామని ఆన్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ అడబాల కుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తానికి బీవీసీ భట్లపాలెం క్యాంపస్ ఒక్కటే సెంటర్ అని పరీక్షలు సజావుగా జరగటానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ ఏవీసీ రామారావు, ఏఓ జక్కం కృష్ణారావు తెలిపారు.

ఐటీఐతో ఉద్యోగ అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న వసంతలక్ష్మి

అమలాపురం రూరల్: ప్రస్తుతం పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఐటీఐ చదివితే ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని జిల్లా ఉపాధి అధికారి, కమిటీ కన్వీనర్ యు.వసంత లక్ష్మి తెలిపారు. అమలాపురం జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఒకేషనల్ గైడెన్స్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీజీ ఎ.వర్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఐటీఐ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు జూన్ 10 వతేదీ వరకూ స్వీకరిస్తారన్నారు. అడ్మిషన్ టీఓటీ మోహనరావు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు మెరుగు ఏరుచుకోవాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, జిల్లా లీడ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్.ఆర్. మేనేజర్, సర్వరాయ సుగర్స్ అధికారులతోపాటు కోనసీమ జిల్లాలో గల అన్ని ప్రైవేట్ యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు రైళ్లలో అదనపు ఏసీ కోచ్‌లు

రాజమహేంద్రవరం సిటీ: వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల సౌకర్యార్థం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లలో శనివారం నుంచి 21వ తేదీ వరకూ అదనంగా ఒక థర్డ్ ఏసీ కోచ్ ఏర్పాటు చేశారు. రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సికింద్రాబాద్ – విశాఖపట్నం – సికింద్రాబాద్ (12740/12739), సికింద్రాబాద్ – విశాఖపట్నం – సికింద్రాబాద్ (22204/22203) రైళ్లలో ఈ అదనపు ఏసీ కోచ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


హుండీల ఆదాయం రూ 3.70 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడులో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీల ద్వారా స్వామివారికి 50 రోజులకు రూ.3,70,291 ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు సహకారంతో ప్రతి శనివారం ఉచిత అన్న సమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తీపర్రు గ్రూప్ దేవాలయాల ఈఓ ఎంవీ రామయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులకు శిక్షణ



రాయవరం: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలోని 12 పాఠశాలల్లో సీబీఎస్‌ఈని గత విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల అల్లవరం, జెడ్పీహెచ్‌ఎస్, పేరూరు, జెడ్పీహెచ్‌ఎస్, కేశనపల్లి, జెడ్పీహెచ్‌ఎస్, తాపేశ్వరం, జెడ్పీహెచ్‌ఎస్, గొల్లవిల్లి, అల్లవరం మండలం గోడిలో ఉన్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బాలురు, బాలికల పాఠశాల, ముమ్మిడివరంలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ పాఠశాల, పి.గన్నవరం మండలం నరేంద్రపురంలోని ఏపీఎస్ డబ్ల్యూఆర్ బాలుర పాఠశాల, రామచంద్రపురం మండలం వెలంపాలెంలో ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలుర పాఠశాల, అమలాపురం మండలం సమనసలో ఉన్న ఎంజేపీఏపీ బీసీ బాలుర పాఠశాల, రాజోలు దొరగారితోటలోఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న సబ్జెక్టు ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ నాన్ రెసిడెన్షియల్ మోడ్‌లో ఇస్తున్నారు. ఇంగ్లిషు, సోషల్, బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఈ నెల 17, 18, గణితం, పీఎస్, కెమిస్ట్రీ సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఈ నెల 20, 21 తేదీల్లో కాకినాడ శాలిపేటలో ఉన్న మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిక్షణకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు హాజరు కావాల్సి ఉందని, ఏ ఒక్కరికీ మినహాయింపులు లేవని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.90.45 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ ప్రతినిధులు

ఆలమూరు: ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి నెల రోజుల వ్యవధిలో రూ.90.45 లక్షల ఆదాయం లభించింది. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ఆవరణలో ఈ హుండీల లెక్కింపు జరిగింది. ఆలయంలోని ప్రధాన హుండీల ద్వారా రూ. 67,40,864, అన్న ప్రసాదం హుండీ ద్వారా 23,04,531 ఆదాయం లభించింది. 710 గ్రాముల బంగారం విరాళాల ద్వారా ఆలయ కమిటీకి అందినట్లు ఏసీ నాగమల్లేశ్వరరావు గురువారం తెలిపారు. దేవదాయశాఖ అధికారులు పీవీపీఎస్ కామేశ్వరరావు, బి.కిరణ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు జెడ్పీ చైర్మన్ విప్పర్తి పరామర్శ



ఆదిమూలంవారిపాలెంలో మణిబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి గ్రామం వద్ద ఇటీవల ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు జట్టు కార్మికుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుని, వారికి అండగా నిలుస్తామని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ప్రమాదంలో జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యనారాయణ, ఈరి కట్లయ్య, ఆదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు మృతి చెందిన విషయం విదితమే. మృతుల కుటుంబాలను జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు గురువారం పరామర్శించారు. అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిలకలపూడి సురేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని విప్పర్తి కిమ్స్ యాజమాన్యానికి వారు విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేష్‌ను పరామర్శించారు. పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సాధనాల రమేష్, కొక్కిరి రవికుమార్, అడ్డగళ్ల శ్రీను పాల్గొన్నారు.

బీపీ... లేకుంటే హ్యాపీ



- అధిక రక్తపోటుతో అనర్థాలు
- జాగ్రత్తలు తీసుకుంటే నియంత్రణ సాధ్యమే
- జిల్లాలో 1.63 లక్షల మంది హైపర్ టెన్షన్ బాధితులు
- నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే



పేషెంట్‌కు బీపీ చెక్ చేస్తున్న డాక్టర్

రాయవరం: సమాజంలో ప్రజలు ఉరుకులు పరుగుల జీవనాన్ని సాగిస్తున్నారు. ఆధునిక జీవన శైలి వల్ల పలు రకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. వీటిలో ముఖ్యంగా హైపర్ టెన్షన్ అత్యంత ప్రమాదకరమైనది. అధిక రక్తపోటు(బీపీ) వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అధిక రక్తపోటు గుండె, మెదడు, నరాలు, కిడ్నీపై చెడు ప్రభావాన్ని చూపిస్తూ అనారోగ్యం బారిన పడేస్తోంది. ఒక్కోసారి పక్షవాతం, గుండెపోటు, ఇతర తీవ్ర అనారోగ్యాలతో ప్రాణాలకు హాని చేస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చాలా మందికి బీపీ ఉందన్న విషయాన్ని గమనించే లోపు ఆ వ్యాధి వలన కలిగే అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటున్నాయి. శుక్రవారం ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ప్రత్యేక కథనం...

సైలెంట్ కిల్లర్

శరీరంలో రక్తాన్ని అన్ని రక్తనాళాలకు గుండె ఒత్తిడి(ప్రెజర్) చేసి పంపిస్తుంది. అధిక వేగంతో రక్తాన్ని ప్రసరింప చేసే శక్తినే బ్లడ్ ప్రెజర్‌గా పేర్కొంటారు. ఒక వ్యక్తి గుండె సాధారణ స్థితిలో బ్లడ్ ప్రెషర్(బీపీ) 120/80గా పేర్కొంటారు. తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పెద్ద వయసులో కొన్ని పరిస్థితుల్లో 140/90గా ఉన్నా సాధారణ స్థితిగానే పరిగణించాలని సూచించింది. అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారని వైద్యులు తెలిపారు. చాలామందికి రక్తపోటు లక్షణాలు ఉన్నట్టు కూడా తెలియక పోవడం వల్ల ఉన్నట్టుండి గుండెపోటు వచ్చి కుప్పకూలి పోతారు. తలనొప్పి, అలసట అనిపిస్తే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి బీపీ చెక్ చేయించుకోవాలి. నేటి ఆధునిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులతో హైపర్ టెన్షన్ ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. హైపర్ టెన్షన్‌లో అసాధారణ రీతిలో 160/100, 170/110, 200/120 చూపుతుంది. ఇలా బ్లడ్ ప్రెషర్ పెరిగితే ఆరోగ్య సమస్య ఏర్పడుతుంది. ఒక్కోసారి మెదడు, గుండెలోనూ నరాలు దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారు. పక్షవాతం, కిడ్నీ సమస్యలు, నరాల సమస్యలు ఏర్పడే ప్రమాదముంటుంది. కరోనా అనంతరం మనిషి జీవన స్థితిగతులు మరింత జటిలం అయ్యాయని వైద్యులు చెబుతున్నారు. కరోనా అనంతరం యువతలో సైతం హైపర్ టెన్షన్ ప్రభావం అధికంగా ఉందనే అభిప్రాయం ఉంది. ఇటీవల 20–30 ఏళ్ల లోపు యువత గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ సమస్యలతో మృత్యువాత పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

కారణాలు

సాధారణంగా అధిక రక్తపోటు వయసు మళ్లిన వారికి వస్తుంది. జన్యుపరమైన కారణాలతో కూడా వస్తుంది. ధూమపానం, ఊబకాయం, ఏ పనిచేయకుండా ఒకే చోట గంటల తరబడి ఉండడం, హైపోథైరాయిడ్, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో కంటికి సరిపడా నిద్ర లేకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక మూత్రపిండాల జబ్బు ద్వారా బీపీ వస్తుంది.

1,63,889 మంది హైపర్ టెన్షన్ బాధితులు

జనరల్ ఫిజీషియన్, కార్డియాలజిస్ట్, నెఫ్రాలజిస్టుల వద్దకు చికిత్స కోసం వెళ్లేవారిలో అధిక శాతం మంది అధిక రక్తపోటు బాధితులే ఉంటారు. వీరి వద్దకు చికిత్సకు వెళ్తున్న వారిలో 20 నుంచి 30 శాతం మంది అధిక రక్తపోటు బాధితులు ఉంటున్నారన్నది ఒక అంచనా. ప్రభుత్వం ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ వైద్య సిబ్బంది ద్వారా పరీక్షలు చేయించి బీపీ బాధితులను గుర్తించి చికిత్స అందిస్తోంది. జిల్లాలో 14,85,148 మందిని స్క్రీనింగ్ చేయగా, వారిలో 1,63,889 మంది హైపర్ టెన్షన్ బాధితులు ఉన్నట్టు ఎన్‌సీడీ సర్వే ద్వారా గుర్తించారు. 1,07,053 మంది డయాబెటీస్ పేషెంట్స్, 70,491 మంది హైపర్ టెన్షన్, సుగర్ వ్యాధిని కలిగి ఉన్న వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు సర్వే ద్వారా తేలింది.

ఉచితంగా ప్రభుత్వ సేవలు

గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల బలోపేతంపై దృష్టి సారించి గ్రామీణ ప్రాంతాల్లోనే బీపీ, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నారు. జనరల్ ఫిజీషియన్‌లను ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించి ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించడంతో పాటు, మందులు కూడా అందజేస్తోంది.

ముందు జాగ్రత్తలే ముఖ్యం



ప్రస్తుత కాలంలో ఆధునిక జీవనశైలి కారణంగా వయసుతో సంబంధం లేకుండా అధిక రక్తపోటు బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంలో ఐదు గ్రాములకు మించి ఉప్పు తీసుకోకూడదు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ ఎం.సుమలత, డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్, అమలాపురం

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- హైపర్ టెన్షన్‌తో బాధపడే రోగులు ముఖ్యంగా ఆహార పదార్థాల్లో ఉప్పును తక్కువగా వినియోగించాలి. మసాలాలు, నిల్వ పచ్చళ్లు, కారం తగ్గించాలి. ప్రతి రోజూ గంటపాటు సాధారణ వ్యాయామం, యోగా వంటివి చేయడం మంచిది. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి. మత్తు పదార్థాలు, ఆల్కహాల్, సిగరెట్ వంటి వాటికి దూరంగా ఉండాలి.

హైపర్ టెన్షన్ లక్షణాలు

- మెడ నరాల లాగేస్తున్నట్టు ఉండడం. కళ్లు తిరగడం, ఆకస్మికంగా తూలిపోవడం, తరచుగా తలపోటు రావడం. ఒళ్లంతా చెమటలు పట్టడం. యూరిన్ తక్కువగా రావడం. కాళ్లు తిమ్మిర్లుగా ఉండడం.

ఎన్నాళ్లీ కూతవేటు?

- కాకినాడ-కోటిపల్లి రైలుబస్సు సేవలు వచ్చేనా?
- నిరుపయోగమైన రైల్వే లైన్ పునరుద్ధరణ
- ప్రధాన రైళ్లకు అనుసంధానంగా నడిపితే ప్రయోజనం



మూడేళ్ల క్రితం సినిమా షూటింగు కోసం వెళుతున్న రైలుబండి(ఫైల్)



నిలిచిపోయిన కాకినాడ-కోటిపల్లి రైలు బస్సు ఇదే (ఫైల్)

కరప: కాకినాడ-కోటిపల్లి రైలుబస్సు సేవలు నిలిచిపోవడంతో ప్రయాణికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పునరుద్ధరించిన రైల్వేలైన్ నిరుపయోగంగా మారడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో వేసిన కాకినాడ-కోటిపల్లి రైల్వేలైన్ తర్వాత కాలంలో పట్టించుకోకపోవడంతో పూర్తిగా ధ్వంసమైంది. కోనసీమ వాసులకు రైల్వే కూత వినిపిస్తానన్న అమలాపురం మాజీ ఎంపీ జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకరు అయ్యాక 2001లో తన పలుకుబడితో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వేలైన్ పునరుద్ధరించారు. తర్వాత నరసాపురం వరకు ఈ రైల్వేలైన్ పొడిగిస్తానని హామీ ఇచ్చారు. తర్వాత బాలయోగి హఠాన్మరణంతో నరసాపురం విస్తరణ మాట మరుగున పడిపోయింది. 2001లో కాకినాడ-కోటిపల్లి రైల్వేలైన్‌ను కరప నుంచే అప్పటి కేంద్ర రైల్వేమంత్రి, జిల్లా మంత్రులతో కల్సి మాజీ స్పీకరు బాలయోగి ప్రారంభించారు. నాలుగు బోగీలతో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రోజుకు నాలుగు ట్రిప్పులు చొప్పున నడిపేవారు. తర్వాత రెండు ట్రిప్పులకు కుదించారు. ప్రయాణికులకు అనువైన సమయాలలో కోటిపల్లి రైలును తిప్పకపోవడంతో క్రమంగా ప్రయాణికులు తగ్గిపోయారు. దీంతో రైల్వే అధికారులు ఇంజన్‌తోకూడిన ఒక బోగీ ఉండే రైలు బస్సును రోజుకు ఒక ట్రిప్పుకే పరిమితం చేశారు. తర్వాత ఆ సేవలను కూడా నిలిపివేశారు. ప్రయాణికుల సంఖ్య ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఆర్థికంగా రైల్వేకు భారంగా ఉందన్న కారణంగా అధికారులు ఈ సర్వీసును పూర్తిగా ఆపేశారు. దీంతో లోక్‌సభ దివంగత స్పీకరు బాలయోగి సాధించిన కాకినాడ-కోటిపల్లి రైల్వేలైన్ నిరుపయోగమైంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రైల్వేలైన్‌ను పక్కన పెట్టిన అధికారుల తీరుపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క కోటిపల్లి నుంచి కోనసీమ మీదుగా నరసాపురం వరకు రైల్వేలైన్‌ను విస్తరిస్తామంటూ, అరకొరగా పనులు చేయిస్తూ కోటిపల్లి వరకు తిరిగే రైలుబస్సును ఆపడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొంతకాలానికి కోటిపల్లిలో సినిమా షూటింగ్ కోసం అంటూ ఆరు బోగీలతో కొన్నాళ్లు రైలు నడిచింది. ఆ తర్వాత ఆగిపోయింది.

ప్రధాన రైళ్లకు అనుసంధానం చేస్తూ నడపాలి

కాకినాడ-కోటిపల్లి రైలు లాభాలు ఆర్జించాలన్నా, ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉండాలన్నా కాకినాడ నుంచి బయలుదేరే ప్రధాన రైళ్లకు అనుసంధానం చేసేలా నడిపితే బాగుంటుందని ప్రయాణికులు అంటున్నారు. కాకినాడ నుంచి ప్రతిరోజూ తెల్లవారు జామున విశాఖపట్నం, విజయవాడ వెళ్లే ఫాస్ట్ ప్యాసింజర్ ట్రెయిన్లు ఎంతో రద్దీగా ఉంటాయి. ఆ సమయంలో గ్రామాల నుంచి వెళ్లేవారికి ప్రయాణ సౌకర్యాలు లేక దూరప్రాంతాలవారు ముందురోజు కాకినాడ వెళుతుంటారు. సాయంత్రం సమయంలో కాకినాడ నుంచి తిరుపతి, హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు కాకినాడ నుంచి వెళుతుంటాయి. ఆయా రైళ్లలో ప్రయాణించేందుకు వీలుగా కాకినాడ-కోటిపల్లి రైలును నడిపితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రయాణికులు అంటున్నారు. రైల్వే అధికారులు స్పందించి కోటిపల్లి రైలుబస్సును పునరుద్ధరించి, ప్రధాన రైళ్లకు అనుసంధానం చేస్తూ నడపాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

మూన్నాళ్ల ముచ్చటగా మారింది



చాలా కాలానికి కాకినాడ-కోటిపల్లి రైల్వేలైన్ వేసి, రైలు నడిపితో చాలా సంతోషపడ్డాం. రైలును ఆపేయడంతో ఆ సంతోషం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. కాకినాడలో బయలుదేరే ప్రధాన రైళ్లలో ప్రయాణించేందుకు వీలుగా కోటిపల్లి రైలును నడిపేలా చర్యలు తీసుకోవాలి.

– కొత్త రవిప్రసాద్, జిడ్.భావారం

రైలు నడిచేలా చర్యలు తీసుకోవాలి



కాకినాడ నుంచి కోటిపల్లి వెళ్లే రైలు గ్రామీణ ప్రాంతాల వారికి అనుకూలంగా ఉండేది. ద్రాక్షారామ, కోటిపల్లి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు, అటునుంచి కాకినాడ నగరానికి వెళ్లేందుకు రైలు ఉపయోగకరంగా ఉండేది. ఆపేసిన కోటిపల్లి రైలును తిరిగి నడిపేందుకు చర్యలు తీసుకోవాలి.

– సాదే ఆశాజ్యోతి, సర్పంచ్, కరప

క్రియేటివ్ ఈ - కంటెంట్ జనరేషన్‌పై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏపీ ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు క్రియేటివ్ ఈ - కంటెంట్ జనరేషన్ విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో నాణ్యతా ప్రమాణాలను పెంచడానికి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అధ్యాపకులు విద్యార్థులకు మరింత ఆసక్తికరంగా విద్యను బోధించడానికి, నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులో తీసుకురావడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను అధ్యాపకులు కంటెంట్లను తయారు చేయడంలో వినియోగించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ కళాశాల విద్యను మరింత ఉన్నత స్థానంలో ఉంచడానికి కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ వివిధ వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యా వ్యవస్థలో ఉన్నత ప్రమాణాలు సాధించడానికి ఆర్ట్స్ కళాశాల నిరంతరం ప్రయత్నిస్తుందని, దీనిలో భాగంగానే ఈ ఏడాది 'స్టడీ ఇన్ ఇండియా' ప్రాజెక్టుకు వేదిక కానుందన్నారు. ఇప్పటికే తొమ్మిది మంది విదేశీ విద్యార్థులు ఈ విధానం ద్వారా కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. అనంతరం ఒక చలికాలపు వేకువలో అనే కవితా సంపుటిని కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆవిష్కరించారు. కళాశాల ఉన్నత విద్యాశాఖ ఏజీవో డాక్టర్ తులసి, ఓఎస్‌డీ ఐటీ డాక్టర్ కవతి, ఆర్‌జేసీ డీసీఈ డాక్టర్ ఎస్.శోభారాణి, కళాశాల తెలుగు శాఖ విభాగాధిపతి డాక్టర్ పీఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనా స్థలిలో మృతిచెందిన ఆవు

కొత్తపల్లి: ఉప్పాడ-అద్దరిపేట బీచ్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. తొండంగి మండలం అద్దరిపేటకు చెందిన ముత్తి దేవుడు (19), దానవాయిపేటకు చెందిన చింతకాయల నాగేంద్ర కలిసి మోటర్ సైకిల్‌పై కాకినాడ వెళుతున్నారు. కోనపాపపేట శివారు మల్లివారితోట సమీపంలోని బీచ్ రోడ్డులో వెళుతుండగా రోడ్డుపై ఆవులు పెనుగులాడుకొని మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో దేవుడు, నాగేంద్రకు తీవ్ర గాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా దేవుడు మార్గం మధ్యలో మృతి చెందాడు. నాగేంద్ర ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.

ఎమ్మెల్సీ తోటపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు



వల్లూరులో సర్పంచ్ మీనాకుమారిని విచారిస్తున్న డీఎస్పీ

కపిలేశ్వరపురం: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అతని కుమారుడు పృథ్వీరాజ్, మరికొందరిపై బుధవారం పోలీసులు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. వల్లూరు గ్రామ సర్పంచ్ దాసి మీనాకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయింది. కొత్తపేట డీఎస్పీ రమణ గురువారం వల్లూరులో ఫిర్యాది మీనాకుమారిని విచారించారు. ఈ నెల 13న పోలింగ్ తర్వాత వల్లూరులో స్థానికంగా తలెత్తిన వివాదం నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్సీ తనయుడు పృథ్వీరాజ్ కారుపై రాళ్లు రువ్వడంతో ఆయన కారు అద్దం ధ్వంసమైంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పృథ్వీరాజ్, నేమాని రాజశేఖర్, చోడే శ్రీకృష్ణ, దేవళ్ళ రుద్రయ్య చౌదరి, దేవళ్ళ రామలింగ చౌదరి, ముత్యాల సతీష్‌కుమార్‌లపై సర్పంచ్ మీనాకుమారి ఫిర్యాదు చేశారు. వేగుళ్ళ అనిత ఫిర్యాదు మేరకు మరో కేసును నమోదు చేశారు. విచారణలో మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, అంగర ఎస్సై పరదేశి పాల్గొన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ యూత్ స్త్రీ పురుష స్టేట్ ఛాంపియన్ షిప్ జిల్లా జట్ల ఎంపిక శుక్రవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాల రావు తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కాలేజీలో ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ధ్రువ పత్రం తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు 1-1-2008 తర్వాత పుట్టిన వారై ఉండాలని ఉండాలన్నారు.

ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులో శ్రీ షిర్డీసాయి విద్యార్థులకు జాతీయ ర్యాంకులు



ఆలిండియా 2వ ర్యాంకు సాధించిన ఐన్ల ఏవో

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలో తమ విద్యార్థులు సత్తా చాటారని రాజమహేంద్రవరం శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల డైరెక్టర్ టి.శ్రీవిద్య గురువారం తెలిపారు. తమ డాఫ్నీ సివిల్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మిజోరం రాష్ట్రానికి చెందిన ఐన్ల ఏవో ఆల్ ఇండియా 2వ ర్యాంకు సాధించిందన్నారు. జి.ప్రసన్నసాయి ఆల్ ఇండియా 328వ ర్యాంకు, ఎన్.భావన 504వ ర్యాంకు సాధించి ఫ్యాషన్ టెక్నాలజీలో ఉన్నత విద్య అభ్యసించడానికి అర్హత సాధించారన్నారు. దేశవ్యాప్తంగా 18 విశ్వవిద్యాలయాలలో కేవలం 4,051 సీట్లు మాత్రమే ఉంటాయని, అందులో ముగ్గురు తమ విద్యార్థులే కావడం ఆనందదాయకమన్నారు. శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ ఐఐటీ, నీట్ వంటి రెగ్యులర్ కోర్సులతో పాటు సివిల్స్, క్లాట్, ఐపీమ్యాట్, క్యాట్ వంటి కోర్సులను తమ విద్యార్థులు ఎంపిక చేసుకోవడం హర్షణీయమన్నారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రపురం: పట్టణంలోని చోడవరం రోడ్డులో గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు రామచంద్రపురం ఎస్సై కె.సురేష్‌బాబు స్థానిక విలేకరులకు తెలిపారు. సుమారు 45 నుంచి 55 ఏళ్ల వయసు గల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో దుర్మణం పాలయ్యారన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించామని తెలిపారు. మృతదేహాన్ని చూసి ఎవరైనా గుర్తుపడితే 94407 96589 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

9న అరసం మహాసభ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మహాసభ జూన్ 9వ తేదీన కాకినాడలో నిర్వహిస్తామని సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో కాకినాడ జిల్లా నూతన కార్యవర్గంను ఎన్నుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

గోకవరం: గోకవరంలో స్థానిక ఇందిరమ్మమోడల్ కాలనీలో జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలో గోపాలపురానికి చెందిన పెనుగుల శ్రీను, శాంతి దంపతులు, గాదెలపాలెంకు చెందిన లలిత నాగలక్ష్మిలు బైక్‌పై గోకవరం నుంచి గోపాలపురం వెళుతుండగా ఇందిరమ్మమోడల్ కాలనీకి వచ్చేసరికి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటో వీరి బైక్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు హెచ్‌సీ శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రత్నగిరికి పెళ్లి కళ

- 19వ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు సత్యదేవుని కల్యాణం
- 24న శ్రీపుష్పయాగంతో ముగియనున్న ఉత్సవాలు
- 20 వేల మంది వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు



కార్యనిర్వహణాధికారి రామచంద్రమోహన్



కొత్త రంగులతో ప్రకాశిస్తున్న సత్యదేవుని ఆలయం



సత్యదేవుని నూతన కల్యాణ మంటపం

అన్నవరం: ఈ నెల 18వ తేదీ నుంచి 24 వ తేదీ వరకు జరుగనున్న రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ, వైశాఖ శుద్ధ ఏకాదశి, ఆదివారం రాత్రి తొమ్మిది గంటల నుంచి జరుగనున్న సత్యదేవుని దివ్యకల్యాణానికి సుమారు 20 వేల మంది భక్తులు తరలి వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ శనివారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను వధూవరులను చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 19వ తేదీ రాత్రి తొమ్మిది గంటల నుంచి స్వామివారి వార్షిక కల్యాణ వేదిక వద్ద స్వామివారి దివ్యకల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల చివరి రోజు 24 వ తేదీన స్వామివారి నిత్య కల్యాణ మంటపంలో శ్రీపుష్పయాగం నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాల ఏడు రోజులూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆదివారం జరుగనున్న స్వామివారి దివ్యకల్యాణానికి విచ్చేసే భక్తులకు ప్రసాదం, అక్షింతల పంపిణీకి పశ్చిమ రాజగోపురం, సర్క్యులర్ మంటపం, పశ్చిమ రాజగోపురం వద్ద ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కల్యాణం పూర్తయ్యాక అక్కడ వీటిని పంపిణీ చేస్తారని తెలిపారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు పలుచోట్ల ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దేవస్థానంలోని సత్యదేవుని ఆలయం, ఇతర ఉపాలయాలకు రంగులు వేయడం పూర్తయిందని తెలిపారు. అదే విధంగా స్వామి, అమ్మవార్లను ఊరేగించే వాహనాలకు కూడా రంగులు వేయడంతో బాటు వాటిని ట్రైల్ రన్ వేసి వాటి లోటు పాట్లు ను సరిచేయడం జరుగుతుందని తెలిపారు. ఉత్సవాల ఏడు రోజులు కార్యక్రమాల నిర్వహణ కు సిబ్బంది కి ప్రత్యేక విధులు అప్పగించామని తెలిపారు. అదేవిధంగా దేవస్థానంలో కొండదిగువన ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేస్తున్నామని తెలిపారు.

కొండ దిగువన ఐదు రోజుల పాటు స్వామివారి ఊరేగింపు

18 నుంచి 22వ తేదీ వరకు ఐదురోజుల పాటు కొండదిగువన వివిధ వాహనాలలో స్వామి, అమ్మవార్లను ఊరేగించనున్నామని తెలిపారు. ఈ ఊరేగింపులో జానపద, నృత్య, సంగీత కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 22వ తేదీన రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

రూ.50 లక్షల వ్యయంతో ఉత్సవాలకు ఏర్పాట్లు

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలకు రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు. స్వామివారి వార్షిక కల్యాణానికి దాతలు విరాళాలు సమర్పిస్తే వాటిని స్వీకరించి దాతల అభీష్టాన్ని అనుసరించి ఖర్చు చేస్తామని తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి మృతి



రాజు (ఫైల్)

కొత్తపల్లి: కుటుంబ కలహాల కారణంగా ఒక యువకుడు ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం ఉప్పాడలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పాడ శివారు కొత్తపేటకు చెందిన కోనాడ రాజు (30) తన కుటుంబంలోని కలహాల కారణంగా మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కొత్తపల్లి పోలీసులు తమకు ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

భూముల శిస్తు పెంచొద్దని ప్రదర్శన

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానానికి అనుబంధంగా ఉన్న అంతర్వేది శివాలయం భూముల శిస్తులు పెంచొద్దంటూ గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అంతర్వేదిపాలెం పంచాయతీ వద్ద ఈ మేరకు రైతు సంఘ జెండాలతో పైసంఘాల జిల్లా ప్రతినిధులు ప్రదర్శన జరిపారు. భూముల్లో పంటలు పండించలేక, పండిన పంటకు తగిన గిట్టుబాటు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు అన్నారు. ఈ మేరకు రైతు సంఘం ఓ వినతి పత్రాన్ని అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేసింది. ఇప్పటికే పలువురు రైతులు శిస్తులు చెల్లించారని, మిగిలిన రైతులు బకాయిలు చెల్లించడానికి 10 రోజులు వ్యవధి ఇవ్వాలని ప్రతినిధులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దేవస్థానం భూములను పరిశీలించి, శిస్తులు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘ గౌరవ అధ్యక్షుడు చెల్లుబోయిన కేశవశెట్టి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి పది నెలల జైలు

పెద్దాపురం: స్థానిక ఎన్‌టీఆర్ నగర్‌లో ఆరు సంవత్సరాల కిందట ఓ యువకుడిపై జరిగిన దాడి చేసిన కేసులో ఇద్దరికి పెద్దాపురం ఏజేఎఫ్ఎం జడ్జి బుల్లెమ్మ పది నెలలు జైలుశిక్షతో పాటు రూ.ఆరు వేల జరిమానా విధించారు. 2018లో ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన దార్ల సాయిపై జగ్గంపేటకు చెందిన వజ్రంగి సుమన్, ఆనూరు గ్రామానికి చెందిన ఇంటి వీర వెంకట సాయికిరణ్ నగదు విషయంపై గొడవ పడి దాడి చేశారు. అప్పటి ఎస్సై కృష్ణ భగవాన్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున డి.నాగరాజు వాదించారు. సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ వెంకటరమణ సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపర్చారు.